ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112    www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02    సంచిక -33౦3    పేజీలు - 08    వెల - 04/-    మంగళవారం 28 అక్టోబర్ 2025

# మొదలైన మొంథా

## ఏపీ తీరం వైపు 'మొంథా' తుపాను

## తీవ్రరూపం దాల్చే అవకాశం

పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు

ప్రస్తుతం కాకినాడకు 570 కి.మీ దూరంలో కేంద్రీకృతం

తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో గాలులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ



అమరావతి, **అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలపై ప్రారంభమైంది. తుపాను కారణంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. తుపాను తీరానికి సమీపించే కొద్దీ దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన తాజా వివరాల ప్రకారం, 'మొంథా' తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 18 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం ఇది చెన్నైకి 520 కిలోమీటర్లు, కాకినాడకు 570 కిలోమీటర్లు, విశాఖపట్నంకు 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను మరింత బలపడి రేపు (మంగళవారం) ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

మిగతా 2లో...



### ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం

మొంథా తుపానుపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు సమీక్ష

రియల్ టైంలో ప్రజలకు సమాచారం అందాలి

తుపాను బాధితులకు రూ.3 వేలు, 25 కిలోల బియ్యం: చంద్రబాబు ఆదేశాలు

# దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

త్వరలో ఎన్నికలు జరుగున్న రాష్ట్రాల్లో నిర్వహణ

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్




న్యూఢిల్లీ,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. తొలిదశ బీహార్‌లో విజయవంతంగా ముగిసిందని మలిదశ త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్టాల్లోని ఓటర్ల జాబితాను నవీకరించడం, ధృవీకరించడం,మిగతా 2లో...





## 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

### అన్ని రాష్ట్రాలకు నోటీసులు

2లో.

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ

అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ

మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం

ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు

ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

## అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలి

కాకినాడ వద్ద తీరం దాటనున్న మొంథా తుఫాన్

జిల్లా అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



అమరావతి,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి** మొంథా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనుందని తెలిపారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి. నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అధికారులు హాజరయ్యారు. మిగతా 2లో...

# ఐకానిక్ రైల్వే స్టేషన్లు

## రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు






నూతన పోర్టులకు తప్పనిసరిగా రైల్వే కనెక్టివిటీ ఉండాలని ఆదేశం

అమరావతి, గన్నవరంలో కొత్త రైల్వే కోచింగ్ టెర్మినళ్లకు ఆమోదం

రాష్ట్రంలోని రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష

అమరావతి,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలకమైన లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైల్వే ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కాకినాడ, విశాఖ పోర్టులతో పాటు రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న మూలపేట, రామాయపట్నం వంటి పోర్టులకు తప్పనిసరిగా రైల్వే అనుసంధానం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉత్పత్తుల రవాణాను సులభతరం చేసేందుకు, లాజిస్టిక్స్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రైలు రవాణా కారిడార్లే కీలకమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై ఆయన కూలంకషంగా చర్చించారు.

మిగతా 2లో...

## తదుపరిసిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సిజెఐ గవాయ్



న్యూఢిల్లీ,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి** సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియనుమిగతా 2లో...

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు

పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు

నవంబర్ 3న కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య

హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



2లో.

# రైతుకు నష్టం కలగొద్దు

కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి

: సీఎం రేవంత్ రెడ్డి

మొంథా తుపాన్ నేపథ్యంలో చర్యలు

ధాన్యం చెడిపోకుండా టార్పాలిన్‌ల వినియోగం



హైదరాబాద్,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో వర్ష సూచనల నేపథ్యంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టం జరగకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారుమిగతా 2లో...

## జిల్లాల పునర్విభజనపై నేడు సీఎంతో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

దాదాపు 200 వినతులు, ప్రతిపాదనలపై కీలక చర్చ

10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సిఫార్సులు

అమరావతి,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పుపై ప్రభుత్వ కసరత్తు తుది దశకు చేరుకుంది. జిల్లాల పునర్విభజనకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నేడు మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు, ప్రతిపాదనలపై ముఖ్యమంత్రితో చర్చించి, ఆయన సూచనల మేరకు తుది నివేదికను రూపొందించనుంది.మిగతా 2లో...



## తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

(మొదటి పేజీ తరువాయి)

అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ పక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ పక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ పక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవుతుంది.రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ , తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.

## ఐకానిక్ రైల్వే స్టేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్వే కారిడార్ల ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. హైదరాబాద్-బెంగళూరు, అమరావతి మీదుగా హైదరాబాద్-చెన్నై మార్గాల్లో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. అమరావతిలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానిస్తూ బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా, తిరుపతిని కలుపుతూ చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఖరగ్‌పూర్ నుంచి చెన్నై వరకు నిర్మించ తలపెట్టిన డెడికేటెడ్ రైలు రవాణా కారిడార్ పనులపైనా ఆయన దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు ఉత్తర-దక్షిణ భారతాలను కలిపే మార్గాలపై దృష్టి సారించామని, ఇకపై తూర్పు-పశ్చిమ రాష్ట్రాలను అనుసంధానించే ప్రాజెక్టులకూ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.
రాజధాని ప్రాంతంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా అమరావతి, గన్నవరంలో నూతన రైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి రైల్వే శాఖ చేసిన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు. వీటి నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ, గుంటూరు నగరాల్లోనూ కోచింగ్ టెర్మినళ్లను విస్తరిస్తున్నట్లు అధికారులు వివరించారు. మరోవైపు, రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి రైల్వే స్టేషన్లను 'ఐకానిక్ స్టేషన్లు'గా అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. నూతన రాజధాని అమరావతిలో నిర్మించే రైల్వే స్టేషన్‌ను కూడా వినూత్న డిజైన్‌తో నిర్మించాలన్నారు. తిరుపతిలో ప్రయాణికుల సౌకర్యార్థం స్కైవాక్ నిర్మించాలని, విశాఖలో జ్ఞానాపురం వైపు స్టేషన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను అధిగమించవచ్చని సూచించారు.
రాష్ట్రవ్యాప్తంగా 73 స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఆధునీకరిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పుష్కరాల కోసం వివిధ ప్రాంతాల నుంచి 1,012 ప్రత్యేక రైళ్లు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని వారు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతుకు నష్టం కలగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం ఆదేశాలతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశముండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వానాకాలం ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అందుబాటులో ఉన్న టార్పాలిన్‌లను వినియోగించి చెడిపోకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల వరకు ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలు సంభవిస్తున్న నేపథ్యంలో వరి కోతలు నిలిపేస్తే రైతులకు ఇబ్బంది ఉండదని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే 4,428 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. మిగిలిన 3,814 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు.సోమవారం నాటికి 22,433 మంది రైతుల నుంచి 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. అందులో దొడ్డు రకం 73,628 మెట్రిక్ టన్నులు, సన్నాలు 1,06,824 మెట్రిక్ టన్నులున్నాయనీ, వాటి విలువ రూ.431.09 కోట్లు అని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ జరపాలనీ, కొనుగోలులో రైతులకు ఎక్కడా ఆటంకాలు కలుగకుండా చూడాలని అన్నారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

## జిల్లాల పునర్విభజనపై నేడు సీఎంతో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ నివేదికను నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించే అవకాశాలు ఉన్నాయి.
పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పు కోసం ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీకి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నుంచి దాదాపు 200 వరకు అర్జీలు అందాయి. వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ఉపసంఘం, జిల్లా అధికారుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. జనగణన ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబర్ 31వ తేదీలోగా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.వైసీపీ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. జిల్లాల విభజన, పెంపు జరిగిన నాటి నుంచి అనేక వివాదాలు, అసంతృప్తులు ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి నాడు వెల్లువెత్తాయి. ప్రజల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించకుండానే గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గందరగోళానికి దారి తీసింది. అయితే ఈ గందరగోళానికి తెరదించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు, ప్రజలు, రాజకీయ నేతల విజ్ఞప్తుల నేపథ్యంలో 26 జిల్లాలను 32 జిల్లాలు చేసేందుకు ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రధానంగా ఆరు కొత్త జిల్లాల ఏర్పాటుపై ఉపసంఘం ముఖ్యమంత్రికి నివేదించనున్నట్లు తెలుస్తోంది.

# ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది.
పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔూ%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని %=ఔూ%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.
తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది.కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.
ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.
కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు.
విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది.
ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# మొదలైన మొంథా

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుఫాన్‌పై ఆందోళన వద్దని, అప్రమత్తంగా ఉందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి 10గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో తుఫాన్ ప్రభావంపై వాతావరణ శాఖ అధికారులతో ఆయన సమీక్ష చేశారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంపై మంగళవారం నుంచి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలపగా.. దీనిపై రియల్‌టైమ్‌లో ప్రజలకు సమాచారం అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ సన్నాహాలు, సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తుఫాన్ సన్నద్ధతపై ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన సమాచారంపైనా సీఎం సమీక్ష చేశారు. అంతకుముందు... ఇదే అంశంపై ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రతి గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేయాలని ఆదేశించారు. తుఫాన్ రక్షణ చర్యల విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుందని, ఆ సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలని చంద్రబాబు కోరారు. ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు పంపి, అవగాహన పెంచాలని, తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్ల అనుభవాన్ని వినియోగించాలని సీఎం సూచించారు. 'రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్ఠం చేయాలి. చెరువులు, కాలువ గట్లు తెగిపోకుండా చూసుకోవాలి. సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా, శాటిలైట్ ఫోన్లు వినియోగించాలి. ప్రత్యేకంగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జనరేటర్లను బ్యాకప్ కోసం వినియోగించాలి. తుఫాన్ వల్ల ఎవ్వరూ ప్రమాదాల బారిన పడకూడదు.
ఒక్క మరణం కూడా సంభవించకూడదు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి" అని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి, జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు అగ్నిమాపక సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రి లోకేష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### తుఫాన్ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం -సీఎం ఆదేశాలు

'మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలి' అని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. మొంథా తుఫాన్‌పై కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి ప్రాంతాల్లో కొండచరియలు జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జి అధికారుల ను నియమించాలి. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. వలంటరీగా వచ్చే వారిని సహాయ కార్యక్రమాలకు వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశించారు.

### చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్

**మంత్రి లోకేశ్‌కు పీఎంవోతో సమన్వయ బాధ్యతలు**

మొంథా ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్రమోదీ తనకు ఫోన్ చేసి, అడిగి తెలుసుకున్నారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంవోతో సమన్వయం బాధ్యతను మంత్రి లోకేశ్‌కు సీఎం అప్పగించారు.

### సన్నద్ధతపై 83శాతం సంతృప్తి : అధికారులు

అధికారులు ఎన్ని రివ్యూలు చేశారనేది కాదని, క్షేత్రస్థాయిలో ఎంత మేర ప్రభావం చూపిందనేది ముఖ్యమని, దీనికి ప్రజాభిప్రాయాన్ని ప్రాతిపాదకగా తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్‌పై ప్రభుత్వ సన్నద్ధత ఎలా ఉందనే అంశంపై సేకరించిన ప్రజాభిప్రాయంలో 83% సంతృప్తి వ్యక్తమైందని అధికారులు వివరించారు. తుఫాన్‌కు సంబంధించి జాగ్రత్తలపై మీమీ ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయా అన్న ప్రశ్నకు 70శాతం మంది అవును.. అని సమాధానమిచ్చారని తెలిపారు. ముందు జాగ్రత్తలపై 74శాతం మంది సంతృప్తిగా ఉన్నారని అధికారులు వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తొలిసారిగా ఈ సిస్టంను ఏర్పాటు చేశామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమాచారం ఆధారంగా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి నేరుగా ఆయా ప్రాంతాలకు మైక్‌ల ద్వారా అప్రమత్తం చేసే అవకాశం ఉందని తెలిపారు.

## అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలి



ఈ సమావేశంలో అధికారులకి పలు కీలక సూచనలు చేశారు డిప్యూటీ సీఎం. కాకినాడ జిల్లాలో 12 మండలాలపై మొంథా తుపాను ప్రభావం ఉంటుందని తెలిసిన క్రమంలో ముందస్తు చర్యలు పకడ్బందీగా ఉండాలని సూచించారు పవన్ కల్యాణ్. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సమకూర్చుకోవాలని మార్గనిర్దేశర చేశారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రజలకి తెలియ జేయాలని సూచించారు పవన్ కల్యాణ్. ప్రజలు ఎలాంటి ఆందోళనకి గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొంథా తుపాను తీరం దాటే సమయంలో గాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా విద్యుత్ స్తంభాలు ఒకవేళ పడిపోతే వాటి పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, రోగుల వివరాలు తెలుసుకొని.. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని దిశానిర్దేశర చేశారు. 24 గంటలూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 28 అక్టోబర్ 2025

# శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే కొనసాగాలి.!

## రాయలసీమ ప్రాణాధారం శ్రీశైలం..ప్రజల విశ్వాశాన్ని కాపాడండి.

### -ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 27:**
శ్రీశైలం రాయలసీమకు ఆధ్యాత్మికంగా, ప్రకృతి పరంగా, విజ్ఞానశాస్త్ర పరంగా అత్యంత ప్రాధాన్యమైన ప్రదేశం అని బొజ్జా పేర్కొన్నారు. 12 జ్యోతిర్లింగాలలో ఒకరైన శ్రీశైలం మల్లికార్జునుడు మరియు 18 మహాశక్తి పీఠాలలో ఒకరైన భ్రమరాంబికాదేవి ఒకే సన్నిధిలో వెలసిన ఏకైక క్షేత్రం శ్రీశైలం పుణ్యక్షేత్రం అని ఆయన వివరించారు. ఆధ్యాత్మిక వికాసానికే కాకుండా, మానసిక ఉల్లాసాన్నిచ్చే ప్రకృతి సంపదలతో రాయలసీమకు శ్రీశైలం ఆధ్యాత్మిక, ద్యాన, మానసికానంద కేంద్రంగా విరాజల్లుతుందని తెలిపారు. ఇదే ప్రాంతంలో, కృష్ణమ్మ ప్రవాహాన్ని నియంత్రించి రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చడానికి, పంటలను పండించడానికి శాస్త్ర విజ్ఞానంతో రూపుదిద్దుకున్న శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం గురించి ఆయన వివరించారు. 60 వేల ఎకరాల భూమిని రాయలసీమ ప్రజలు త్యాగంతో నిర్మించారన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇటీవలి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు శ్రీశైలం దర్శనానికి విచ్చేసి క్షేత్ర ప్రాధాన్యాన్ని, ఆధ్యాత్మిక క్షేత్రాలున్న రాయలసీమ ఖ్యాతిని ప్రస్తావించిన విషయం ఆయన గుర్తు చేశారు.



ఈ నేపద్యంలో శ్రీశైలం క్షేత్రాన్ని కొత్తగా ఏర్పాటుచేస్తున్న మార్కాపూర్ జిల్లాలో కలుపుతారన్న వదంతులు రాయలసీమ ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది రాయలసీమ గౌరవానికి, అభివృద్ధి అవకాశాలకు పెద్ద దెబ్బ అవుతుందని ఆందోళన వ్యక్తపరిచారు. రాయలసీమకు గర్వకారణమైన శ్రీశైలం ప్రాంతాన్ని రాయలసీమకు దూరం చేసే ఏ ప్రయత్నాన్నైనా రాయలసీమ ప్రజలు ఎదురిస్తారని ఆయన పేర్కొన్నారు.

**ఇది అత్యంత సున్నితమైన అంశం.**
ప్రజల భావోద్వేగాలకు ముడిపడిన ఈ అంశంపై వస్తున్న వదంతులను ప్రభుత్వం తక్షణమే ఖండించి అధికారిక ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ఆధ్యాత్మిక కేంద్రాల ప్రాముఖ్యతను తగ్గించే ప్రయత్నం చేసిన గత పాలకులు దైవ మహత్యంతో ఇబ్బందులు పడిన విషయం ప్రస్తుత పాలకులు మరిచిపోవద్దని ఆయన హెచ్చరించారు. గతంలో నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి రాయలసీమతో సహజ సంబంధాలు ఉన్నాయి. అనేక మంది గిద్దలూరు ప్రాంత వాసులు నంద్యాలలో ఉపాధ్యాయులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వారందరినీ మేము అన్నదమ్ములుగా భావించి ఆదరిస్తున్నాం. ఈ సంబంధాన్ని మరింత బలంగా కొనసాగించడానికి గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని నంద్యాల జిల్లాలో కలపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.
రాయలసీమ ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని అత్యంత బాధ్యతగా తీసుకొని, శ్రీశైలం రాయలసీమలోని నంద్యాల జిల్లా పరిపాలనా పరిధిలోనే కొనసాగేలాగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 27:**నంద్యాల జిల్లాలోని బాధితులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసులతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 4,26,627లక్షల చెక్కులను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి బాధితులకు సోమవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో పంపిణి చేశారు. నందికొట్కూరు పట్టణం మారుతీ నగర్ బి. రాజేష్ కు రూ. 20,227వేలు, కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన బోయ జయంతికి రూ. 43,734 వేలు, మిడ్తూరు గ్రామానికి చెందిన టి. వేధవతమ్మకు రూ. 81,000 వేలు, ఓర్వకల్లు మండలం శకునాల గ్రామానికి చెందిన రాజశేఖరరెడ్డి కి రూ. 1,00,597 లక్షలు, కొత్తపల్లి మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన బోయ అరుణ కు రూ. 1,17,00 లక్షలు, ప్రకాష్ నగర్ కు చెందిన జే. లక్ష్మణ్ కు రూ. 63,368 వేలు, మొత్తం రూ. 4,26,627 లక్షల చెక్కులు బాధితులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తుందని, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే పరిగణలోకి తీసుకొని బాధితులకు అండగా నిధులు విడుదల చేయడం సంతోషకరం అన్నారు. బాధితులు కూడా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## హిందూ ధర్మ స్మశాన వాటికకు కంపౌండ్ వాల్, మౌలిక సదుపాయాలు కల్పించాలి.



**ఆంధ్ర ప్రగతి పాణ్యం అక్టోబర్ 27:**
పాణ్యం మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ ఆనుకుని స్మశానం ఉన్నది ఆ స్మశానానికి చుట్టూ కాంపౌండ్ వాల్ లేదు కొన్ని వందల సంవత్సరాల నుండి పాణ్యం గ్రామ నివాసులు ఎవరైనాచనిపోగా (జగ్రావగు) , స్కూల్ ఆనుకొని రోడ్డుఆనుకొని ఉన్న స్మశానంలో పూడుస్తున్నారు. హై స్కూల్ కు పాణ్యం గ్రామానికి నుండి ఊర్లోకి ప్రజలు నిత్యం వందలాది మంది విద్యార్థులు స్కూల్ కు బస్టాండ్ వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. ఈ విషయంపై గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థి సంఘాలు ఎన్నోసార్లు అర్జీలు పెట్టిన ఏ ఒక్క అధికారి ఇంతవరకు స్పందించడం లేదు కావున విద్యార్థులకు భద్రతగా స్మశానే వాటికకు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి అందులో మౌలిక సదుపాయాలు, త్రాగునీరు,స్మశానం లో మట్టి కూడాఏర్పాటు చేసి ప్రజలకు సరైన వసతులు కల్పించాలని, హిందూ ధర్మ స్మశానం ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మార్వో ని ఆధ్వర్యంలో ఎమ్మార్వో, నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ యు ఐ మండల నాయకుడు వేణు హుసేన్ బాషా, పల్లెత్ కాన్ విద్యార్థులు పాల్గొన్నారు .

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 140 ఫిర్యాదులు.

### విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిదిలో న్యాయం చేస్తాం.

### జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ అక్టోబర్ 27:**నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఫిర్యాదిదారుల నుంచి 140 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన డ్రైవర్ కు జైలు శిక్ష.

### రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి.. సురక్షితంగా గమ్యం చేరండి.

### ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ యుగంధర్.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ క్రైమ్ అక్టోబర్ 27:**
రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మరియు ప్రజల భద్రతను పెంపొందించేందుకు, నంద్యాల జిల్లా యస్పీ సునీల్ షెరాన్, ఆదేశాలమేరకు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ సూచనలతో, ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ గారి ఆధ్వర్యంలో, ఆళ్లగడ్డ పట్టణ ఎస్సై లు మరియు సిబ్బంది గత కొద్ది రోజులుగా ఆళ్లగడ్డ పట్టణం లో డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, అతి వేగంగా వాహనాలు నడిపే వాహనదారులపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్గుర్రం భాస్కర్ %హా/శీ% నడిపి తిరుపాలు, వయసు 50 సంవత్సరాలు, నరసాపురం గ్రామం, రుద్రవరం మండలం అనే వ్యక్తిని ఆళ్లగడ్డ, జుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు నందు హాజరు పరచగా, గౌరవ మెజిస్ట్రేట్ స్కూల్ బస్సు డ్రైవర్ అయిన గుర్రం భాస్కర్ కు 10 రోజులు జైలు శిక్ష విధించారు.ఈ సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ మాట్లాడుతూ.. మోటారు వాహన చట్ట నిభందనలు అతిక్రమించి వాహనం నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## ప్రజా దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించండి.

### రీ ఓపెన్ అయిన దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయండి.

### పిజిఆర్ఎస్‌కు 282 దరఖాస్తులు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 27:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో ప్రజలు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి, నాణ్యతతో నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత రెండు వారాల్లో రీ ఓపెన్ అయిన దరఖాస్తులు 481 ఉన్నాయని... ప్రధానంగా రెవెన్యూ, సర్వే విభాగాల్లో అధికంగా ఉన్నాయని వెంటనే స్పందించి క్లియర్ చేయాలని తాసిల్దార్లు, ఆర్డిఓలను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్బ్యాక్ స్వీకరణ 39 శాతం మాత్రమే ఉందని 50 శాతానికి



పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గడువులోపు పరిష్కరించాల్సిన సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న ఆడిట్ పై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
1)ప్యాపిలి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన పి. సుగణ వారి తండ్రి పేరున సర్వే నంబర్ 594లో రెండు ఎకరాల విస్తీర్ణంలో పొలం ఉందని, ఆ భూమిని కొంతమంది ఆన్లైన్‌లో తమ పేరుతో మార్చుకున్నారని, సదరు భూమిని పరిశీలించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. 2)పగిడ్యాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఎస్. నరసరావుకు చెందిన భూమిని నీలం సంజీవ రెడ్డి శ్రీశైలం ప్రాజెక్టు కోసం స్వాధీనం చేసుకున్నారని, అందుకు నష్టపరిహారం కింద ఉద్యోగావకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
3)ఆళ్లగడ్డ మండలం ఆర్. పాపంపల్లికి చెందిన బి. మోహన్ రెడ్డికి పి. చింతకుంటలో ఒక ఎకరా భూమి ఉందని, అయితే ఆన్లైన్‌లో 90 సెంట్ల భూమి మాత్రమే నమోదైందని, మిగతా భూమిని పరిశీలించి ఆన్లైన్‌లో చేర్చాలంటూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.
ఈ కార్యక్రమంలో మొత్తం 282 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. అన్ని అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ డిఆర్ఓ జారీ చేసారు.

## ప్రజాభిప్రాయ సేకరణలో మెరుగైన శాతాన్ని సాధించాలి.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 27:**
ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రజల నుండి సేకరించే అభిప్రాయాల ప్రక్రియలో నంద్యాల జిల్లా రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం, ప్రజాభిప్రాయ సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన రెవెన్యూ, సర్వే, గృహనిర్మాణం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, పింఛన్ పంపిణీ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్య సేవలు, తదితర విభాగాల్లో ప్రజాభిప్రాయ సేకరణలో అసంతృప్తికర స్పందనలు రాష్ట్ర స్థాయిలో నమోదైన నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో సరిదిద్దే దిశగా చర్యలు




తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రజలు ప్రభుత్వ సేవలను ఎలా అనుభవిస్తున్నారన్నదానికి ప్రతిబింబమని ప్రతి అధికారి తమ పరిధిలోని సచివాలయాల పనితీరును సమీక్షించి, తగు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 13 సచివాలయాలు ప్రజాభిప్రాయ సేకరణలో దిగువ స్థానంలో ఉన్నాయని, ఇది సిబ్బంది పనితీరు అసంతృప్తికరంగా ఉన్నట్లు స్పష్టం అవుతోందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే, ఆయా సచివాలయ సిబ్బందిపై, సంబంధిత తహసీల్దారులు, ఆర్డీవోలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు. పనితీరు మెరుగుపరుచుకుని ప్రజాభిప్రాయ సేకరణలో మెరుగైన శాతాన్ని సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
అలాగే డోన్, బేతంచర్ల, ఆత్మకూరు మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు అసంతృప్తికరంగా ఉన్నట్లు ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైనట్లు తెలిపారు. పారిశుధ్య కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రతీ మున్సిపాలిటీ మరియు గ్రామ సచివాలయ పరిధిలో రోజువారీ శుభ్రత పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రజల అభిప్రాయాల ద్వారా ప్రభుత్వ పథకాల పనితీరు అంచనా వేయబడుతుందని, అందుకే ప్రతి శాఖ ప్రజల సంతృప్తిని లక్ష్యంగా పెట్టుకోవాలని ఆమె అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడానికి అధికారులందరూ కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ డిఆర్ఓ రాము నాయక్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ టౌన్ నందు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు.

### రక్తదానం చేసిన పలువురికి ఆదర్శంగా నిలిచిన ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్. -రక్తదాన శిబిరం విజయవంతం.







**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ క్రైమ్ అక్టోబర్ 27:**
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలమేరకు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డీయస్పీ కె.ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం" ప్రజలందరి సహకారంతో విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముందుగా ఆళ్లగడ్డ డిఎస్పి కె.ప్రమోద్ రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు, అనంతరం ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ గారు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది మొత్తం -27 మంది, యువత, ఇతర ప్రజలు -79 మంది మొత్తంగా 106 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన స్టేట్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బందికి, ప్రజలకు, ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ సిబ్బంది అందరికీ డీయస్పీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# భారీ వర్షాలకు వచ్చే అవకాశం ఉంది..
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**ఉల్లి, మొక్కజొన్న, టమోటా రైతులు పంట కోత వాయిదా వేసుకోవాలని సూచన.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**నంద్యాల, అక్టోబర్ 27:**
మొంథా" తుఫాను ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలందరినీ అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో తుఫాన్ ప్రభావ భద్రతా చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. కార్తిక్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మొంథా తుఫాను కాకినాడ%-%విశాఖపట్నం మధ్య తీరం దాటుతుందని, దాని ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు నంద్యాల జిల్లాపైనా ఉండే అవకాశముందని అన్నారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో జిల్లాలోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఉల్లి, మొక్కజొన్న, టమోటా రైతులు పంట కోతను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 30 శాతం మొక్కజొన్న కోత జరగగా, అధిక తేమ కారణంగా పంటలకు తక్కువ ధరలు పడే అవకాశం ఉందని, వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పంటలను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు పంట కోత వాయిదా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, ముఖ్యంగా ఆత్మకూరు పట్టణంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆమె మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు మాత్రమే అందేలా చర్యలు చేపట్టాలని, అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఆమె సూచించారు. అదే విధంగా ఆర్ఓ ప్లాంట్లలో క్లోరినేషన్ నిర్వహించడమే కాకుండా ఫిల్టర్ మెంబ్రేన్లను శుభ్రపరచాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని ప్లాంట్లను సీజ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావంతో ప్రమాదావస్థలో ఉన్న మట్టి మిద్దెల్లో నివసించే ప్రజలకు నోటీసులు జారీ చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా కెనాల్స్, చెరువుల వద్ద గండి పడిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఇసుక సంచులు వంటి అవసరమైన సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని, అధిక వర్షపాతం నమోదైతే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఆధార్ అప్‌డేట్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఆధార్ వివరాలు సరిచేయని వారు తప్పనిసరిగా బయోమెట్రిక్, చిరునామా తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఈ-కెవైసీ పూర్తి చేసి ప్రభుత్వ లబ్ధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా పూర్తి చేయాలని, వర్షాల వల్ల నష్టపోయే పంటలపై ఈ-క్రాప్ నమోదు ఆధారంగా నష్టపరిహారం అంచనా వేయగలమని కలెక్టర్ వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు జారీ చేసే అపార్ ఐడీలు కూడా ఈ క్యాంపుల్లో పొందేలా అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

## మనోబంధు ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ మరియు జాయింట్ కలెక్టర్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 27:**సమాజ సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవైనవని ఇలాంటి మంచి కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ లు అన్నారు. సోమవారం జిల్లా ఎస్పి, జాయింట్ కలెక్టర్ కార్యాలయాల్లో మనోబంధు ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "సమాజ సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవైనవి. ఇలాంటి మంచి కార్యక్రమాలకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా, అలాగే తెలంగాణ ప్రాంతంలో కూడా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. దేశవ్యాప్తంగా రోడ్ల వెంట, పట్టణాల్లో నిరాధారంగా తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి వారికి సరైన వైద్యసహాయం, పౌష్టికాహారం, యోగా శిక్షణ, పునరావాస సేవలు అందించడం మనోబంధు ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విధంగా వారు కోలుకున్న తర్వాత, వారిని వారి కుటుంబ సభ్యుల వద్దకు లేదా గుర్తింపు పొందిన వసతిగృహాలలో చేర్చడం ఫౌండేషన్ ధ్యేయమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి నాగేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఉస్మాన్ భాష, మనోబంధు ఫౌండేషన్ రాయలసీమ రీజనల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నకిలీ మధ్యాన్ని అరికట్టవచ్చు.
## -టిడిపి రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్.





**ఆంధ్ర ప్రగతి గోస్పాడు అక్టోబర్ 27:** మద్యం కొనుగోలులో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నిజమైన బ్రాండ్, దుకాణం వివరాలు, మద్యం పూర్తి వివరాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ప్రజలకు సూచించారు.టీడీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్ఎండి ఫయాజ్ ఈరోజు గోస్పాడులోని లక్ష్మీ వైన్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడి మద్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫయాజ్ మాట్లాడుతూ.. ప్రజలంతా క్యూఆర్ కోడ్ ను స్కానింగ్ చేయడం ద్వారా ఏది నకిలీ మద్యం, ఏది మంచి మద్యం అనే తేడాను గుర్తించాలని కోరారు. ఈ క్యూఆర్ కోడ్ విధానం ద్వారా నకిలీ మద్యం అమ్మకాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ లేని లేదా నకిలీ మద్యం కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఫయాజ్ తెలిపారు. అక్రమంగా తయారు చేసిన మద్యం సేవించడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు ప్రాణాపాయాలు కూడా సంభవించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అలాగే, అనుమానాస్పద మద్యాన్ని నివారించడానికి ఉద్దేశించిన "ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలని ఎన్ఎండి ఫయాజ్ కోరారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, భద్రంగా ఉండాలంటే ఈ యాప్‌ను తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, కేఎల్ దీపక్ రెడ్డి, సర్పంచ్ బాలన్న, రంగ శేఖర్ రెడ్డి, కామిని మల్లికార్జున, ప్రసాద్ రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ను
## ప్రారంభించిన నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ అక్టోబర్ 27:**
పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ పోలీసు ఆయుధాల ప్రదర్శన ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాగానే పోలీసు జాగిలం హాని మరియు హ్యాండ్లర్ నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, పరికరాలు, సాంకేతిక సాధనలను గురించి ఎస్పీ విద్యార్థులకు వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరులను స్మరించుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతిభద్ర నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు అందరూ పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.



**ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు....**

ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాలో పోలీసులు వాడే 410 డిపి మస్కట్,7.62 యం యం బోల్ట్ యాక్షన్ రైఫెల్,7.62 యం యం ఎస్ ఎల్ ఆర్, 7.62 ఎం ఎం ఏ కె 47 రైఫెల్ 9 యం యం కార్బన్ ,9 ఎంఎం పిస్టల్ వి ఎల్ పిస్టల్ 16 ఎం ఎం పి పి టి,ఫెడరల్ గ్యాస్ గన్, టియర్ స్మోక్ గ్రనేడ్స్ ,టియర్ స్మోక్ షెల్ , 303 రఫీల్, 380 రివాల్వర్,ఫైబర్ లాఠీ ,హెల్మెట్ స్టోన్ గార్డ్,బాడీ ప్రొటెక్టోర్,పోలీసు వయర్ లెస్ కమ్యూనికేషన్,హాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టోర్ ,డీప్ సర్చ్ మెటల్ డిటెక్టోర్ డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టోర్ మొదలగు పరికరాలు అవి పనిచేయు విధానం గురించి పోలీసులు విద్యార్థులకు, వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు రూపొందించిన శక్తి యాప్ వాటి ప్రయోజనాల గురించి మరియు సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు ముఖ్యంగా మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలని మహిళా ఇన్స్పెక్టర్లు గౌతమి జయరాం వారి సిబ్బంది వివరించడం జరిగింది. సైబర్ క్రైమ్ నేరగాళ్ల చేతిలో పడకుండా ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో విద్యార్థులకు తెలియజేస్తూ మీరు విన్న వాటిని మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.





**అబ్బురపరిచిన పోలీస్ జాగిలం హనీ విన్యాసాలు**

విన్యాసాలులో భాగంగా ముందుగా జిల్లా ఎస్పీ గారికి పోలీసు జాగిలం హాని మరియు హ్యాండ్లర్ గౌరవ వందనం చేశారు అనంతరం జాగిలం పేలుడు పదార్థాలు ఉంచిన బాక్సులను గుర్తించాయి. అంతేకాక పోలీసు జాగిలాలు పేలుడు పదార్థాలు మరియు హత్యలు, దొంగతనాలు జరిగిన సందర్భాలలో నిందితులను గుర్తించడం కోసం జాగిలాలు విధులు నిర్వహిస్తాయి.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగందర్ బాబు ఆర్ ఐలు బాబు, మంజునాథ్ ,సురేశ్ బాబు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది విధ్యార్థిని విధ్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాట్ పట్టిన బైరెడ్డి
## నేను కూడా క్రికెటర్ నే- రాజశేఖరరెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 27:**కళలు, క్రీడలకు పుట్టినిల్లు అని, ఎంతో మంది క్రీడాకారులను రాయలసీమ అందించిందని రాయలసీమ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కర్నూలు పరిధిలోని మునగాలపాడు వద్ద ఆర్. కె రాయలసీమ క్రికెట్ అకాడమిని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్బంగా బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టమని, మా ఇంట్లో పెద్దలకు తెలియకుండా కర్నూలు నుంచి రైలులో హైదరాబాద్ కు వెళ్లి క్రికెట్ ఆడి తన స్నేహితులతో తిరిగి వచ్చేవారమణి అన్నారు. క్రికెట్ కు మంచి క్రేజ్ ఉందని, ప్రతిభగల క్రికెటర్లు మంచి ఆదాయం కూడా తీసుకుంటున్నారని, ప్రతి ఒక్కరు ఆటను ఆనందం, ఆరోగ్యం కోసం ఆడాలని బైరెడ్డి కోరారు. ఈ ఆర్ కె రాయలసీమ క్రికెట్ అకాడమి వల్ల ప్రతిభగల క్రీడాకారులు తయారు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

## ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే బిజెపి విధానాలను వ్యతిరేకించాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 27:**
ప్రభుత్వ రంగ ఎల్ఐసి సంస్థ లో ఉన్నటువంటి ముప్పై మూడు వేల కోట్ల రూపాయల పెట్టుబడులను అదాని కంపెనీకి తరలించడానికి వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి డి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పీ నరసింహ, కె ఎం డి. గౌస్,పార్టీ సీనియర్ నాయకులు టి. మద్దులు సిపిఎం జిల్లా నాయకులు నరసింహ నాయక్, ఎమ్మార్ నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ కంపెనీకి అప్పులు పెరిగి ప్రపంచవ్యాప్తంగా అప్పు పుట్ట నందువల్ల ఆ కంపెనీని ఆదుకోవడానికి మోడీ ప్రభుత్వం, నీతి ఆయోగ్,ఆర్థిక శాఖ సంస్థలన్నీ కలిపి ఎల్ఐసి వద్దనున్న 33000కోట్ల పెట్టుబడులను కంపెనీకి తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు,ఉద్యోగస్తులు ఆపద సమయంలో నమ్మకంగా ఎల్ఐసి సంస్థ ఆదుకుంటుదని పెద్ద ఎత్తున ఎల్ఐసి లో డిపాజిట్లు చేస్తున్నారు. ప్రజల డిపాజిట్లను ప్రజలకు సంబంధం లేకుండా మోసపూరితమైన అదాని కంపెనీకి తరలించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.గతంలోనే హిడేన్ బర్గ్ నివేదిక




ప్రకారము డొల్ల కంపెనీల ద్వారా అధిక ధరలకు అమ్ముతూ కంపెనీ ఆస్తులు పెంచుకుంటున్నారని నివేదిక పేర్కొన్నది. 2004 సంవత్సరంలో కూడా సోలార్ కంపెనీలు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు లంచాలు ఇచ్చి తమ యొక్క పెట్టుబడులను విస్తరించుకుంటున్నారని అమెరికా కోర్ట్ లలో కేసు నమోదు అయింది. ఇప్పుడు కూడా అదాని కంపెనీ అప్పులు ఎక్కువైనాయి. అంతర్జాతీయ సంస్థలు అప్పులు ఇచ్చే పరిస్థితులు లేని కారణంగా మోడీ ప్రభుత్వ యొక్క ఆదేశంతో ఎల్ఐసి పెట్టుబడులను 28 వేల కోట్ల బాండ్ల రూపంలో ఐదువేల కోట్లు షేర్ల రూపంలో ఈ రకంగా మళ్ళించడానికి ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో వడ్డీ తక్కువగా వస్తుందని అధాని ఎక్కువ ఇస్తున్నాడని ఆ సంస్థకు మళ్ళించడానికి దీనికి ఎవరు గ్యారెంటీ అని వారు ప్రశ్నించారు. ఎల్ఐసి సంస్థ 500 కోట్లతో ప్రారంభమై లక్షల కోట్ల రూపాయలు బిజినెస్ చేస్తూ, వేల కోట్ల రూపాయలు డివిడెంట్ రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్న నమ్మకమైన సంస్థను గొంతుకోయడానికి ఈరోజు మోడీ ప్రభుత్వం పూనుకోవడాన్ని సిపిఎం పార్టీగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే అదాని కంపెనీలో పెట్టిన పెట్టుబడులను వెనక్కు తీసుకోవాలని లేనట్లయితే తీవ్రమైనటువంటి ఆందోళన చేయవలసి వస్తుందని వారు తెలియజేశారు. ప్రజల ఆస్తిని మోడీ ప్రభుత్వం స్నేహితుడికి కట్టబెట్టడం దుర్మార్గమని ఇటువంటి విధానాలను బిజెపి ప్రభుత్వం మానుకోవాలని లేకుంటే ప్రజలే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## అనుమానితుల ఇళ్లలో తనిఖీలు.






**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 27:** మహానందిలో ఫారెస్ట్ శాఖ అధికారులు అనుమానితుల ఇళ్లలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలుస్తుంది. వన్యప్రాణులను వేటాడి , ఉచ్చులు వేసి వధించి వాటి మాంసాన్ని క్రయవిక్రయాలు జరుగుతున్నారన్న ఆరోపణలు వినవస్తుండడంతో ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలువురి అనుమానిత ల ఇళ్లలో సోదాలు చేపట్టినట్లు డిఆర్ఓ హైమావతి పేర్కొన్నారు. మన్యప్రాణులను వేటాడి లేదా ఉచ్చులు వేసి చంపి వాటి మాంసాన్ని విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ఈ తనిఖీల్లో మొబైల్ పార్టీ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగేంద్ర ఎఫ్ బి ఓ ప్రతాప్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 2న తితిదే ఆధ్వర్యంలో నాలుగు ఎస్సీ కాలనీలలో మంగళ కైశిక ద్వాదశి వేడుకలు.

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 27:**
కార్తిక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణం, పొన్నాపురం, ఎస్సీకాలనీలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం, ఆళ్ళగడ్డలోని ఆదర్శ అభ్యుదయ నగర్ కాలనీలోని శ్రీరామాలయం, కోడుమూరు మండలం, వర్కూరు గ్రామం, ఎస్సి కాలనీలోని శ్రీరామాలయం, గూడూరు మండలం, పెంచికలపాడు గ్రామం, ఎస్సీకాలనీలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం మొత్తం నాలుగు ఎస్సీ కాలనీలలోని దేవాలయాలలో కార్తిక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని మంగళ కైశిక ద్వాదశి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణం, పొన్నాపురం, ఎస్సీ కాలనీనందు ఆ సామాజిక వర్గానికి చెందిన వారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సత్యవంతుడు అనే మాల దాసరి తన సత్యనిష్ఠ ద్వారా శ్రీమహావిష్ణువుని ఏ విధంగా సేవించి విష్ణు పదం పొందాడో తెలుపుట కొరకు, హరిదాసులను ప్రోత్సహించుటకై తిరుమల తిరుపతి దేవస్థానములు ఉమ్మడి రాష్ట్రం అంతటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తితిదే హిందూ ధర్మ ప్రచారం మండల సభ్యులు టి.వి. వీరాంజనేయరావు, అర్చకులు శేషుపాములేటి, రామనరసింహులు, ఆ సామాజిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాను తో అప్రమత్తంగా ఉండాలి.

### -విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి.




**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 27:**
మొంథా తుఫాను ప్రభావంతో కురిసే భారీ వర్షాల కారణంగా రైతులు, విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మహానంది మండలంలో మొంథా తుఫాను ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని,విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.రైతులు పంట పొలాల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.పశువులను మేపేటప్పుడు జాగ్రత్తగా ఉండి,విద్యుత్ స్తంభాలకు కట్టరాదని, ఇంట్లో బట్టలను అరేసుకోవడానికి విద్యుత్తు తీగలను వాడరాదని తెలిపారు.ఉరుములు, పిడుగులు సంభవించినప్పుడు విద్యుత్ లైన్స్ క్రింద ఉండరాదని,మీ కనుచూపు మేర ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడిన వెంటనే మీ ఏరియా కరెంటు ఆఫీసుకి కాని,మీ యొక్క లైన్ మెన్ కు సమాచారం అందించాలన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

## కొత్తూరు సుబ్బరాయునికి 3.244 కేజీల వెండి వస్తువులు విరాళం..!





**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు. పాణ్యం. అక్టోబర్ 26**
:ప్రముఖ శైవక్షేత్రము లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవము పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 3 కేజీల 244 గ్రాముల వెండి వస్తువులు ఆదివారం వితరణ చేసినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన దేరెడ్డి నాగిరెడ్డి, దేరెడ్డి నాగ మునీశ్వర రెడ్డి వారి కుటుంబ సభ్యులకు స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా "వెండి బిందె, వెండి పళ్ళెము, వెండి చెంబు" మూడు వస్తువులు 3 కేజీల 244 గ్రాములు విరాళంగా కార్యనిర్వాహణాధికారికి సమర్పించారు. వీటి విలువ సుమారు 5 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. దాతలకు ఆలయ మర్యాదలతో అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, పాణ్యం ట్రైనింగ్ ఎస్సై ధనుంజయ, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు తీసుకున్న చర్యలు దుర్మార్గం.

### ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నిర్వహణ చేపట్టాలి. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 27:**
రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకోవడం దుర్మార్గమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శిల్పారచంద్ర కిషోర్ రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్న నేపథ్యంలో నేడు నంద్యాల మాజీ ఎమ్మెల్యే కిషోర్ రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్ నందు కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ మద్దతును తెలియజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడం దుర్మార్గమైన చర్యలని ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూర దృష్టితో పేద, మధ్యతరగతి పిల్లల యొక్క బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వైద్య విద్యను చేరువ చేసేందుకు రాష్ట్రంలో నూతనంగా 17 మెడికల్ కళాశాలలను కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంసి ద్వారా అనుమతులను తీసుకురావడం జరిగిందని తెలిపారు. అయితే తొలిదశలో నిర్మించిన ఐదు మెడికల్ కళాశాలలను నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. అటు తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మిగతా 12 మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలను తీసుకోకుండా అడ్డుకొని దుర్మార్గంగా పేదవారి పిల్లలకు వైద్య విద్య దూరం చేసేందుకు కుట్రలు పన్ని పిపిపి విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కళాశాల నిర్వహణను అప్పజెప్పేందుకు నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. దీనిని వైఎస్ఆర్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజలకు మాత్రం మెడికల్ కళాశాలలు ఉన్నాయన్న వాస్తవం తెలుసని అయితే ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాత్రం మెడికల్ కళాశాలలు కంటికి కనిపించడం లేదని ఎంతో హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పట్టణ, గ్రామస్థాయిలో కోటీ సంతకాల సేకరణ నిర్వహించి మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయకుండా, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలన్న డిమాండ్లతో వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర గవర్నర్ కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల్లో వెల్లువెత్తుతున్న చైతన్యం, స్వచ్ఛందంగా వారందరూ ముందుకు వచ్చి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ తమ యొక్క సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ పిపి నాగిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గోపవరం సాయినాథ్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ సెక్రెటరీ దేశం సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ , నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికలా రెడ్డి, నంద్యాల జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్, జిల్లా అధికార ప్రతినిధిఅనిల్ అమృత రాజ్, నంద్యాల అసెంబ్లీ గ్రీవెన్స్ అసెంబ్లీ అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, నంద్యాల అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ సెక్రెటరీ దేవ నగర్ బాషా,సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు టివి రమణ, నంద్యాల అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాసులునంద్యాల నంద్యాల మండల వైసీపీ అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, కౌన్సిలర్స్ శాదిక్,సమ్మద్, ఆరిఫ్ నాయక్, కలాం భాష, మజీద్, తమిమ్, వాసగిరి భాస్కర్ చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమోహన్, మేష చంద్రశేఖర్, భాషీద్, మరియు వైసీపీ నాయకులు మునయ్య, కన్నమ్మ, దండే సుధాకర్, కాల్వ నాగరాజు, సాయిరాం రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, సుబ్బరాయుడు, శ్రీరాములు, మానిపాటి అంజి, పార్ధుడు, రహంతుల్లా, ఎద్దు రవి,జాకీర్ హుస్సేన్, పైలెట్, లక్ష్మీనారాయణ,పున్న శేషయ్య, కిరణ్ కుమార్,గన్నీ కరీం, జీఎం గౌస్, రామచంద్రుడు,రత్నబాబు చౌదరి,ఎర్రన్న, శంకర్ రెడ్డి,సోహెల్ రానా, జుబెర్, మరియు నాయకులు పాల్గొన్నారు

## పోరాట ఫలితంగా నే వి ఓ ఏ ల కాల పరిమితి చట్టం రద్దు.

**వి ఓ ఏ ల అక్రమ తొలగింపులు ఆపాలి.**

**పొదుపు మహిళల ఉత్పత్తులకు మార్కెట్ చూపించాలి.**

**వి ఓ ఏ ల ఉపాధిని దెబ్బతీస్తే ఉద్యమాలు తప్పవ్.**

**వి ఓ ఏ ల సంఘం 5 వ మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ధనలక్ష్మి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 27:**
వి ఓ ఏ ల పోరాట ఫలితంగానే 3 సంవత్సరం ల కాల పరిమితిని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వి ఓ లపై రాజకీయజోక్యం పెరిగిపోతుందని ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ వి ఓ ఏ లను తొలగిస్తుందని ఏపీ వి ఓ ఏ ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు.వి ఓ ఏ ల జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే కనీస వేతనాలు 26 వేలకు పెంచాలని, హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలనీ ఆమె డిమాండ్ చేశారు.

ఏపీ వి ఓ ఏ ఉద్యోగుల సంఘం 5 వ రాష్ట్ర మహాసభలు సోమవారం నంద్యాల జిల్లా కేంద్రం లోని జేకే ఫంక్షన్ హాల్ లో ఉత్సాహం భరితంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ముందు వి ఓ ఏ ల సీనియర్ నాయకురాలు ఏ నిర్మలమ్మ జెండాను ఆవిష్కరించారు.మహాసభలకు అధ్యక్ష వర్గంగా సి హెచ్ రూపదేవి, పి. మహేష్, కృష్ణమ్మ, శ్రీదేవి లు వ్యవహారించారు. అనంతరం జరిగిన ప్రారంభోత్సవ సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఏ. నాగరాజు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వం రంగ సంస్థలను వేగవంతంగా ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్తున్నారన్నారు. కూటమి నాయకులు స్కీమ్ వర్కర్ల పై కత్తి కట్టారని, తొలగింపులే ప్రధాన అజెండగా పెట్టుకొని గ్రామాల్లో వి ఓ ఏ లను తొలగిస్తున్నారన్నారు.కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చుతూ కార్మిక, ఉద్యోగ వర్గాలను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని ఆయన ఘాటు వాఖ్యలు చేశారు. 2023 లో కార్మిక చట్టాల సవరణ పేరు మీద పార్లమెంటులో బిల్లు పెడితే రాష్టంలోని టీడీపీ వైసీపీ పార్టీలు పోటీ పడి మోడీకి అనుకూలంగా ఓటు వేశారన్నారు.అనంతరం వి ఓ ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ధనలక్ష్మి మాట్లాడుతూ వి ఓ ఏ లపైన రాజకీయ వేధింపులు పెరిగి పోతున్నాయని, ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి చెందిన రాజకీయ నాయకులు వి ఓ ఏ ను అన్యాయంగా తొలగిస్తున్నారన్నారు.వి ఓ ఏ లను తొలగించాలంటే గ్రామ ఐక్య సంఘాల తీర్మానం లేకుండా, పొదుపు గ్రూపులను తమ గుప్పెట్లో పెట్టుకొని గ్రామ స్థాయి నాయకులు ఇస్తాను సారంగా తొలగింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. 25 ఏళ్లుగా పని చేస్తున్న వి ఓ ఏ లకు నేటికీ కనీస వేతనాలను పెంచకపోవడం శోచనీయమని, చట్టభద్ద మైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వాలను వేతనాలు పెంచాలని అడిగితే ప్రభుత్వం ఉద్యోగులు కాదని దాటావేస్తున్నారని, ప్రభుత్వ సభలకు మాత్రం జనాన్ని కదిలించడం కోసం వి ఓ ఏ లు అవసరం వస్తుందా అని ఆమె ప్రశ్నించారు.రెగ్యులర్ గా వి ఓ ఏ లకు 4 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా వారి కుటుంబాలు గడుస్తాయని ప్రశ్నించారు. మహిళా సాధికారత పేరుతో లక్షల రూపాయలు లోన్లు ఇస్తున్నట్లు పేపర్ ప్రకటనలు తప్ప ఆచరణలో నామ మాత్రపు రుణాలు ఇస్తున్నారని,పొదుపు మహిళలకు లబ్ది చేకూరడం లేదన్నారు. పొదుపు మహిళల ఆర్థికభివృద్ధి సాధించడంలో ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ల్యాండ్ పులింగ్ పేరుతో పేదల భూములు లాక్కుంటున్నారన్నారు. మహిళా సరికారత పేపర్ ప్రకటనలకే పరిమితం అయింది తప్ప ఆచరణలో లేదన్నారు. మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులకు అమ్ముకోవడానికి మార్కెట్ చూపించాలని అప్పుడే మహిళా సాధికారత సాధ్యమౌతుందన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ఒక కుటుంబం ఆరోగ్యాంగా ఉండాలంటే కనీస వేతనం 26 వేలు ఉండాలని నివేదికలు చెపుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. నూటికి 80 శాతం ప్రజలు పేదరికంలో బ్రతుకుతున్నారని, అనేక మంది ఆకలితో చనిపోతున్నరన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలంటే ఆ కుటుంబాలకు కనీస వేతనాలను పెంచాలన్నారు. వి ఓ లను తొలగించడానికి అధికార పార్టీ నాయకులు పోటీ పడి తొలగిస్తున్నారని,వైజాగ్, అనకాపల్లి జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో తొలగిస్తున్నారన్నారని ఆమె తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అపార్టీల నాయకులు స్కీమ్ వర్కర్ల పోస్టులను వేలం వేస్తున్నారని,

అక్రమ తొలగింపులపై తిరగబడాలని అప్పుడే మన ఉద్యోగాన్ని కాపాడుకోగలమని ఆమె మహాసభ లో పిలుపునిచ్చారు.వి ఓ ఏలు తమ ఉపాధిని కాపాడికోవాలని,ఐక్యంగా ఉంటేనే ఉపాధిఅవకాశాలు కాపాడుకోగలరని ఆమె అన్నారు.మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి దయ రమాదేవి, సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షులు వి ఏసు రత్నం, వి ఓ ఏ ల సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# లేని భ్రమరావతికి మాత్రం వేల కోట్లు..

## మెడికల్ కళాశాలలకు మాత్రం డబ్బు లేదా..? మాజీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 27:** నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 24 25 34 వార్డులలో వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, వైసిపి స్టేట్ సెక్రటరీ దేశం సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాభూమిసా, కౌన్సిలర్ చంద్రశేఖర్, జిల్లా వైసిపి సెక్రెటరీ దేవనగర్ బాషా, కో ఆప్షన్ సభ్యులు శోభారాణి, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ నిర్వహించారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న తీరును నిరసిస్తూ పేద విద్యార్థులకు విద్యను అందించాల్సిన చదువును రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ వారి భవిష్యత్తుపై భారం వేస్తున్నారు.లేని భ్రమరావతికి మాత్రం వేలకోట్ల రూపాయలు వెచ్చించే చంద్రబాబు నాయుడు పేద మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే మెడికల్ కళాశాలలను నిర్మించేందుకు మాత్రం డబ్బుల్లేవు అనడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు దుర్మార్గపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని పేదలకు వైద్యం అందకుండా వైద్య విద్య అభ్యసించకుండా చేసేలాగా తీసుకుంటున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మునుపెన్నడు ఎవరు చేయని విధంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువచ్చి పేద మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు కృషి చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చంద్రబాబు మాత్రం పేద మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్రలు చేయడం సరైన నిర్ణయం కాదని వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్న వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్ జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్ కౌన్సిలర్స్ షాదిక్ భాష, చింపింగ్ బషీద్, నంద్యాల జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారు రవికుమార్ నంద్యాల అసెంబ్లీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోజ్, వైసిపి నాయకులు దాదాభాయ్,కత్తి నజీర్, సాయిరాం రెడ్డి, కిరణ్ కుమార్, మరియు వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ఎస్. కొత్తూరులో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు.













**ఆంధ్ర ప్రగతి ఎస్ కొత్తూరు/ పాణ్యం అక్టోబర్27:**
కార్తిక తొలి సోమవారం సందర్భంగా బనగానపల్లె మండలంలోని పలు శైవక్షేత్రాలు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి

తెల్లవారుజామున పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో శివాలయాలను క్షేత్రాలను సందర్శించి శివయ్యకు ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. ప్రధానంగా ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి క్షేత్రానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. పెద్ద పుష్కరిణిలో పుణ్యస్నానాలను ఆచరించిన భక్త జనం క్యూలైన్లలో వెళ్లి ఉమామహేశ్వరులను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం గాలిగోపురం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో..ఆలయం ముఖ్య కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర్ రెడ్డి ఆలయ సిబ్బంది భక్తుల రద్దీని అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా క్యూలైన్ పర్యవేక్షణ జరిపి భక్తులకు గర్భాలయంలో స్వామివారి అభిషేకాలకు, స్పర్శ దర్శనానికి అవకాశం కల్పిస్తూ ప్రతిఒక్కరికి త్వరితగతిన స్వామివారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకై పెద్దకొనేరు నుండి మెట్ల మార్గంలో చలువ పందిళు వేసి, దేవాలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం, ప్రత్యేకంగా పులిహోర ప్రసాదాలను అందజేశారు.

యాగంటిలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు

కార్తీక తొలి సోమవారం సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పాండురంగారెడ్డి వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి దర్శనం అనంతరం శాలువతో సత్కరించి,తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఎస్ కొత్తూరులో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతుల పూజలుకార్తిక తొలి సోమవారం సందర్భంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు వేకువజామునపాణ్యం మండలం కొత్తూరు శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ అర్చకులచే తీర్థప్రసాదాలు,వేద పండితుల ఆశీర్వచనాలు అందచేశారు.

# గేట్లు, స్ల్యూయిజ్‌లు, సక్రమంగా పనిచేసేలా చూడండి

## ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## సచివాలయం నుంచి సమీక్షించిన మంత్రి నిమ్మల



అమరావతి,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి** తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఈ స్థాయి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు జారీ చేశారు. గేట్లు, స్ల్యూయిజ్‌లు, సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. చెరువులు, కాల్వగట్లు కోతకు గురైతే తక్షణమే మరమ్మతులు చేయాలని ఆజ్ఞాపించారు. దిగువకు నీరు విడుదల చేసే ముందు, సమీప నీటి ప్రవాహ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు మార్గనిర్దేశర చేశారు. మొంథా తుపాను నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షకు కడా స్పెషల్ కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకి తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకోని, బుడమేరు డైవర్షన్ ఛానెల్‌పై నిరంతర నిఘా ఉంచాలని దిశానిర్దేశర చేశారు. వెలగలేరు రెగ్యులేటర్ నుంచి ఎనికేపాడు యూటీ వరకు విజయవాడ నగర పరిధిలో.. పాత బుడమేరు సమీప ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని ఆదేశించారు. ఎర్ర కాలువ, యనమదురు డ్రైన్, బురద కాలువ, సుద్ద వాగు, ఏలేరు రిజర్వాయర్, రైవాడ కాలువ వంటి వాటిపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, శాఖలతో ఎప్పటికప్పుడూ సమన్వయం చేసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచనలు చేశారు.

--------------

# విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్..



విజయవాడ**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి** నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు.కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయన, ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద చేతిలో దీపం వెలిగించి, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ.. "నా వ్యక్తిత్వంపై నింద వేశారు. నా మనసును గాయపరిచారు. అందుకే కుటుంబంతో సహా వచ్చి, ఏ తప్పు చేయలేదని అమ్మవారి ఎదుట నిండు మనసుతో ప్రమాణం చేశాను. నా కుటుంబాన్ని అవమానించిన వారికి అమ్మవారు మంచి బుద్ధి ప్రసాదించాలి" అని అన్నారు.గతంలో తాను చెప్పినట్లే తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని తెలిపారు. నకిలీ మద్యం కేసులో నార్కో అనాలసిస్, లైడిటెక్టర్ టెస్టులకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు.ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి" అని సవాల్ విసిరారు.

# విచారణ జరిపి న్యాయం చేస్తాం

## జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూలుఅక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**
జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సందర్భంగా మొత్తం 135 ఫిర్యాదులు స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. సోమవారం కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎస్పీ స్వయంగా విన్నారు.వివిధ ఫిర్యాదుల్లో ఉద్యోగ వాగ్దానాల పేరుతో మోసాలు, భూమి వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆకతాయిల వేధింపులు వంటి అంశాలు ఉన్నాయి. ఉద్యోగం ఇప్పిస్తామని రూ.4 లక్షలు తీసుకొని మోసం చేసిన ఘటనపై విచారణకు ఆదేశాలు. నందవరం మండలంలో రూ.3.10 లక్షల మోసం చేసిన ఫిర్యాదు.రూ.30 లక్షల మార్ట్‌గేజ్ డీడ్ మోసం, పొలం దౌర్జన్యాలు, మద్యం సేవించి బెదిరింపులు, వృద్ధ మహిళపై కుటుంబ వేధింపుల కేసులు కూడా నమోదు అయ్యాయి. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ ప్రభావం -ఆయా జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు



అమరావతి,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**
మొంథా తుఫాన్ దూసుకొస్తున్న వేళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లోని పాఠశాలలకు, కాలేజీలకు అధికారులు సెలవులు ప్రకటించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విశాఖ జిల్లాలో సోమవారం,మంగళవారం రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో కూడా కలెక్టర్ విజయ కృష్ణన్ మూడు రోజులు సెలవులు ప్రకటించారు. మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అన్ని విద్యాసంస్థలను మూసివేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా విద్యా సంస్థలను తెరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. మరోవైపు.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా నదులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లు తున్నాయి. సోమశిల డ్యాంలో 70÷ుఓఅలు, కండలేరు జలాశయంలో 60÷ుఓఅలకు నీరు చేరుకుంది. వెయ్యి హెక్టార్లలో పంటలు నీటి మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో చేపల వేట, చేనేత పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్తులు ఎదురైనా సిద్ధంగా ఉండాలని అధికారులకి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తున్నారు

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 28 అక్టోబర్ 2025

# దిగివస్తున్న బంగారం ధరలు

## రూ. 1140 మేర తగ్గుదల నమోదు

హైదరాబాద్,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**: ఊహించినట్టుగానే సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బంగారం ధరలు మరింతగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లల్లో పసిడి ధరల తగ్గుదల, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటం వెరసి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో నేడు ట్రేడింగ్ మొదట్లో పసిడి ధరలు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర గతంతో పోలిస్తే రూ. 1140 మేర తగ్గి రూ. 1,24,480కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1050 మేర తగ్గి రూ.1,14,100 వద్ద తచ్చాడుతోంది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి అంతర్జాతీయ మార్కెట్‌లల్లో కూడా పసిడి ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఔన్స్ బంగారం (24 క్యారెట్) స్పాట్ ధర రూ.0.7 శాతం మేర క్షీణించి 4,082.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 1 శాతం మేర తగ్గి 4,095.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు మరింత తగ్గే ఛాన్సుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.అమెరికా, చైనా మధ్య సానుకూల వాతావరణంలో వాణిజ్య చర్చలు జరుగు తుండటంతో సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండికి డిమాండ్ తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రామాణిక వడ్డీ రేట్ల కోత విషయంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయం గురించి మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించంతో
కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లల్లో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం ఉంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాత్రం వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.

-------------

# డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

## ప్రణాళిక రూపొందించాలని సిబిఐకి ఆదేశం

న్యూఢిల్లీ,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**



డిజిటల్ అరెస్టులపై సిబిఐ దర్యాప్తుల జరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని సుప్రీం పేర్కొంది. వరుసగా జరుగుతోన్న సైబర్ నేరాల కారణంగా పలువురు ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేసుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన ఓ కేసును సుమోటాగా తీసుకొని విచారణ జరుపుతోంది ఈ నేరాలపై సీబీఐ దర్యాప్తును పర్యవేక్షిస్తానని పేర్కొంది. డిజిటల్ అరెస్ట్ కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. ఈ సందర్భంగా సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయని, ఈ కేసుల దర్యాప్తునకు ఒక ప్రణాళికను రూపొందించాలని సీబీఐను ఆదేశించింది. కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులో పురోగతిని పరిశీలిస్తామని, దానిని బట్టి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తామని పేర్కొంది. అలాగే డిజిటల్ అరెస్ట్ కేసులకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది.

-----------

# మొంథా తుఫాన్ ప్రభావం

## పలుచోట్ల కురుస్తున్న వర్షాలు

## ఆయా జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు

అమరావతి,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి** మొంథా తుఫాన్ దూసుకొస్తున్న వేళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లోని పాఠశాలలకు, కాలేజీలకు అధికారులు సెలవులు ప్రకటించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విశాఖ జిల్లాలో సోమవారం,మంగళవారం రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో కూడా కలెక్టర్ విజయ కృష్ణన్ మూడు రోజులు సెలవులు ప్రకటించారు. మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అన్ని విద్యాసంస్థలను మూసివేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా విద్యా సంస్థలను తెరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. మరోవైపు.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా నదులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లు తున్నాయి. సోమశిల డ్యాంలో 70÷ఓఅలు, కండలేరు జలాశయంలో 60÷ఓఅలకు నీరు చేరుకుంది. వెయ్యి హెక్టార్లలో పంటలు నీటి మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో చేపల వేట, చేనేత పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్తులు ఎదురైనా సిద్ధంగా ఉండాలని అధికారులకి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తున్నారు

# చిరంజీవి డీప్‌ఫేక్ కేసు

## దర్యాప్తు చేపట్టిన నగర పోలీసులు -త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తాం

## నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి



హైదరాబాద్,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి** మెగాస్టార్ చిరంజీవి ఫిర్యాదు చేసిన డీప్‌ఫేక్ కేసులో విచారణ చేస్తున్నట్లు నగర సీపీ సజ్జనార్ తెలిపారు. చిరంజీవి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ కేసు విషయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీప్‌ఫేక్ మూలాల్లోకి వెళ్లి నిందితులను అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఇలాంటి డీపీఫేక్ సెలబ్రిటీల కేసులు పెరిగే అవకాశం ఉందని అన్నారు. దీనిపై త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి విచారణ చేస్తామని ఆయన వెల్లడించారు. చాదర్‌ఘాట్ కాల్పుల కేసులో కూడా పురోగతి ఉందని స్పష్టం చేశారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. మెగాస్టార్ చిరంజీవి ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలుగా మార్చి వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో దుండగులు పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్‌గా మారాయి. దీనిపై ఆయన వెంటనే సీపీ వీసీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కోర్టును సైతం ఆశ్రయించటంతో న్యాయస్థానం ఆదేశాలతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తన పేరును దెబ్బతీసేలా డీప్‌ఫేక్ వీడియోలు రూపొందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను మెగాస్టార్ చిరంజీవి కోరారు.

# ఢిల్లీలో రోజురోజుకూ క్షీణిస్తున్న గాలి నాణ్యత

## తీవ్రమైన వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు -ఆస్పత్రుల్లో పెరుగుతున్న శ్వాసకోశ కేసులు

న్యూఢిల్లీ,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత
గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణెశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు



పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించ వచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఒఖఎ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఒఖఎ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఒఖఎ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు. సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

# కార్తీక సోమవారంతో శైవాలయాల్లో భక్తుల రద్దీ

## వేకువ జామునే పుణ్యస్నానాలతో ఆలయాలకు చేరిక -పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

కాకినాడ,**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రాల్లో భక్తుల ర ద్దీ పెరిగింది. ఉదయం నుంచే పరమేశ్వరుడికి అభిషేకాలు జరిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజాము నుండి పాదగయ పుష్కరినిలో పవిత్ర స్నానమాచరించి.. కార్తీక దీపాలు వెలిగిస్తూ.. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పాదగయ క్షేత్రంలో కార్తీక మాస మొదటి సోమవార వైభవం.. పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని పాదగయ క్షేత్రం, త్రిగయా క్షేత్రాల్లో ముఖ్యమైనదిగా ప్రసిద్ధి చెందిన పవిత్ర స్థలం. ఇక్కడి శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయం, శ్రీ పురుహూతికా దేవి శక్తిపీఠంతో కలిసి ఉన్న ఈ పుణ్యక్షేత్రాన్ని అత్యంత పవిత్రమైన ప్రాంతంగా స్థానిక భక్తజనం నమ్ముతారు. ఈ ఆలయం శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ప్రథమ అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ మహారాజు జన్మభూమిగా కూడా ప్రసిద్ధి. పురాణాల ప్రకారం,



గయాసురుడి యజ్ఞాన్ని కుక్కుట (కోడి) రూపంలో భంగం చేసిన శివుడు ఇక్కడ కుక్కుటేశ్వరుడిగా స్థిరపడ్డారని ప్రతీతి. తెల్లని లింగస్వరూపంలో దర్శనమిచ్చే స్వామివారు, పితృముక్తి కోసం భక్తులకు మొదటి గయాగా ప్రసిద్ధి చెందారు. కార్తీక మాసం మొదటి సోమవారంసందర్భంగా, ఈ పవిత్ర క్షేత్రం భక్తులతో అలరారుతోంది. తెల్లవారుజాము నుండే పాదగయ పుష్కరిణిలో పవిత్ర స్నానం
చేసిన భక్తజనం, కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు అర్పిస్తున్నారు. ఈ కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనదని పురాణాలు చెబుతున్నాయి. సూర్యోదయానికి ముందు నిద్రలేచి, నదీ స్నానం చేసి, మహామృత్యుంజయ మంత్రాలు జపించడం, ఆవునేతి లేదా నువ్వుల నూనెతో దీపారాధన చేయడం వంటి ఈ నియమాలు పాటించినవారు పుణ్యఫలం పొందుతారని పండితులు చెబుతున్నారు. పాదగయ పుష్కరిణి ప్రాంతంలో ఇప్పుడు దేవదీపాల జ్యోతి, 'హర మహాదేవ' గానాలు, భక్తుల భక్తిభావనలు కలిసి ఒక దైవిక

# మగువల కన్నా మగవాళ్లలోనే వేగంగా మెదడు క్షీణత

## యూనివర్సిటీ ఆఫ్ ఓస్లో పరిశోధనలో వెలుగులోకి..

**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

వృద్ధుల్లో మతిమరుపు సమస్య సాధారణమే.. వయసు పైబడిన కొద్దీ మెదడులోని కణజాలం నశించిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీని వల్ల జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలు ఎదురవుతుంటాయి. అల్జీమర్స్, డిమెన్షియా వంటి వివిధ రకాల సమస్యలు చుట్టుముడతాయి. వృద్ధాప్యంలో మెదడు క్షీణిస్తుందని పరిశోధకులు గతంలోనే గుర్తించారు. అయితే, తాజా పరిశోధనలో సంచలన విషయాలు బయటపడ్డాయి. వృద్ధుల్లో మెదడు క్షీణత అనేది మహిళలకంటే మగవాళ్లలోనే వేగంగా జరుగుతోందని నార్వేకు చెందిన ఓస్లో యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. ఈ అధ్యయనం వివరాలను 'పీఎన్ఏఎస్' జర్నల్ ఇటీవల ప్రచురించింది.



**పరిశోధన సాగిందిలా..**

17 సంవత్సరాల నుంచి 95 సంవత్సరాల వయసున్న 4,726 మంది వాలంటీర్లను ఈ పరిశోధన కోసం ఎంచుకున్నట్లు ఓస్లో యూనివర్సిటీ పరిశోధకుడు అన్నే రవాండల్ తెలిపారు. మూడేండ్ల వ్యవధితో ప్రతీ ఒక్కరికీ రెండు సార్లు ఎంఆర్ఐ స్కాన్ లు చేయించామన్నారు. మొత్తంగా 12 వేల బ్రెయిన్ స్కాన్ లు తీసి వాటన్నింటినీ విశ్లేషించినట్లు తెలిపారు. ఇందులో మహిళల్లో కన్నా పురుషుల్లోనే మెదడు క్షీణత వేగంగా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. పురుషుల మెదడులోనే కణజాలం వేగంగా క్షీణిస్తోందని వెల్లడైందని రవాండల్ వివరించారు.

**మహిళల్లోనే అల్జీమర్స్ బాధితులు ఎక్కువ**

వయసు పెరుగుతున్న కొద్దీ మనుషుల మెదడు వేగంగా క్షీణిస్తుంది.. ఇది పురుషుల్లోనే ఎక్కువని తాజాగా తేలింది. అయితే, మెదడు క్షీణత తక్కువగా ఉన్నప్పటికీ మహిళల్లోనే అల్జీమర్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తమ పరిశోధనలో వెల్లడైందని రవాండల్ తెలిపారు. ఇది తమకు ఆశ్చర్యాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. మనుషుల మెదడు క్షీణతపై లింగ ప్రభావం ఉంటుందనే దానిపై ఇప్పటివరకూ పెద్దగా సమాచారం లేదని ఆయన తెలిపారు. అయితే, మెదడు క్షీణతపై లింగ ప్రభావం అంశంపై మరింత లోతైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని రవాండల్ అభిప్రాయపడ్డారు.

# రుణాలిచ్చే 'మనీవ్యూ' యాప్ నుంచి రూ. 49 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు



**అక్టోబర్ 27, ఆంధ్ర ప్రగతి**

రుణాలు మంజూరు చేసే యాప్ 'మనీవ్యూ'కు సైబర్ నేరగాళ్లు సుమారు రూ.49 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టారు. ఈ యాప్ యొక్క ఏపీఐ సిస్టంలోకి చొరబడిన హ్యాకర్లు కేవలం మూడు గంటల వ్యవధిలో దాదాపు రూ.49 కోట్లు కొల్లగొట్టారు. మనీవ్యూ యాప్, విజ్డమ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ యాప్‌ను దుబాయ్, చైనా, హాంకాంగ్, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందిన సైబర్ హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారు.యాప్‌నకు చెందిన ఏపీఐ కీని ఉపయోగించి మూడు గంటల వ్యవధిలో రూ.49 కోట్లను కొట్టేసి, వాటిని 653 నకిలీ ఖాతాలలోకి బదిలీ చేశారని బెంగళూరు సైబర్ క్రైమ్ బ్రాంచ్ వెల్లడించింది. దుబాయ్‌లోని భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి, బెళగావికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి వద్ద నుంచి వర్చువల్ ప్రైవేటు సర్వర్‌ను కొనుగోలు చేసి ఈ సైబర్ దాడికి పాల్పడినట్లు సమాచారం.ఈ కేసులో ఇస్మాయిల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరొక వ్యక్తిని బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రకు చెందిన రెండో నిందితుడి పేరు మీద ఉన్న నకిలీ ఖాతాకు కూడా డబ్బు బదిలీ అయింది. ఇతర బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అయిన రూ.10 కోట్లను పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి దుబాయ్‌లో ముగ్గురిని, హాంకాంగ్‌లో ఇద్దరిని అనుమానితులుగా గుర్తించారు. వారిని గుర్తించేందుకు బెంగళూరు సీసీబీ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# మరోసారి బాలయ్య జోడీగా నయనతార?



నయనతారకి తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో మంచి క్రేజ్ ఉంది. ఒక వైపున సీనియర్ హీరోల సరసన చేస్తూనే, మరో వైపున నాయిక ప్రధానమైన కథలను ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. నయనతార ఎంట్రీ ఇచ్చి 20 ఏళు దాటిపోయింది. అయినా ఆమెకి గల క్రేజ్.. మార్కెట్ తగ్గకపోగా పెరుగుతూ ఉండటం విశేషం. ఇప్పుడు కూడా ఆమె పెద్ద బ్యానర్లలో .. భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో ఆమె చిరంజీవి సరసన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఒక రేంజ్ లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాలకృష్ణతో నయనతార మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఒక టాక్ షికారు చేస్తోంది. బాలకృష్ణతో 'వీర సింహారెడ్డి' చేసిన గోపీచంద్ మలినేని, ఆయనతో ఇప్పుడు మరో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సినిమాకి సంబంధించిన కథను, చిరంజీవి సినిమా సెట్లోనే గోపీచంద్ మలినేని ఆమెకి వినిపించాడని టాక్. కథ నచ్చడంతో నయనతార ఓకే చెప్పడం జరిగిపోయిందని అంటున్నారు. అదే నిజమైతే బాలకృష్ణ సరసన ఆమెకి ఇది నాలుగో సినిమా అవుతుంది. గతంలో వీళ్ల కాంబినేషన్లో వచ్చిన సింహా .. శ్రీరామరాజ్యం .. జై సింహా విజయాలను సాధించిన సంగతి తెలిసిందే.



# బాబీ కొల్లి చిరు కాంబినేషన్‌లో మెగా 158



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఆయన లైన్‌లో ఉన్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో ఒకటి దర్శకుడు బాబీ కొల్లి (కె.ఎస్. రవీంద్ర) దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం. చిరు జన్మదినం సందర్భంగా ఈ సినిమాను ప్రకటించడంతో మెగా ఫ్యాన్స్‌లో భారీ ఎ÷-జగైట్‌మెంట్ నెలకొంది. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం మరో సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ 'బ్లడీ బెంచ్‌మార్క్ సెట్ చేసిన బ్లేడ్' అనే ట్యాగ్‌లైన్‌తో మెగా మాస్ హిస్టీరియాను పెంచింది. రక్తంతో తడిసిన చిలుక ఆకారం, గొడ్డలి డిజైన్ చూసి ఇది రస్టిక్ మాస్ యాక్షన్ డ్రామా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ సినిమాలో చిరంజీవితో పాటు మరో స్టార్ హీరో కూడా కీలక పాత్రలో నటించబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ ఈ సినిమాలో భాగమవుతున్నాడని తమిళ వర్గాలు పేర్కొన్నాయి. ఇది కేవలం గెస్ట్ రోల్ కాదు, ఫుల్ లెంగ్త్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని టాక్. చిరు కార్తీ స్క్రీన్ షేర్ చేస్తారన్న ఈ వార్త మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటిస్తారని వార్తలు వస్తున్నాయి. ఇక బాలీవుడ్ యాక్టర్-డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్.సంగీతాన్ని ఎస్. థమన్ అందించనున్నారు. ఇటీవలే ఆయన ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ధృవీకరించారు. 'మెగా 158' చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేసేలా షూటింగ్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.త్వరలోనే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటుల జాబితా అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.




# బాహుబలిలో కొత్త సన్నివేశాలు

భారతీయ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించిన 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకే మూవీగా 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ సినిమా షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ.. పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. బాహుబలి' రెండు భాగాల్లోని కొన్ని సన్నివేశాలను కట్ చేసి 'బాహబలి: ది ఎపిక్'ను తీసుకొస్తున్నాం. ఎమోషన్ మిస్ కాకుండా ఉండేందుకు ఒక కొత్త సన్నివేశం యాడ్ చేశాం. కొత్తగా చిత్రీకరించిన సీన్ కాదు. అప్పుడు ఎడిటింగ్‌లో తీసేసిన సీన్ ఇప్పుడు ఉపయోగపడుతోంది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టు కలర్ గ్రేడింగ్ మార్చాం అని అన్నారు. రాజమౌళి 'ఈగ' సినిమా తర్వాత బాహుబలి ఆలోచన చెప్పారు. ఇది విజువల్ వండర్ అని అప్పుడే నాకు అర్థమైంది. ఎలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందన్న కోణంలో కొంత రీసెర్చ్ చేశా. నిర్మాత శోభు యార్లగడ్డ, రాజమౌళిని ఒప్పించి మరీ ఈ సినిమాని డిజిటల్ కెమెరాలో షూట్ చేశా. ఈ సినిమా విషయంలో నేను తీసుకున్న కీలక నిర్ణయమదే. చాలా పెద్ద ప్రాజెక్టు కావడం అందుకే ఈ సినిమాని బయట షూట్ చేయకుండా రామోజీ ఫిల్మ్ సిటీలో చేశాబని తెలిపారు.

# గర్ల్‌ఫ్రెండ్‌లో గెస్ట్ రోల్‌ను తిరస్కరించిన వంగా



నేషనల్ క్రష్ రశ్మికా మందణ్ణ నటించిన హిందీ మూవీ 'థామా'వంద కోట్ల క్లబ్ లో చేరింది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ బ్యానర్ నుండి ఇటీవల కాలంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రాల సరసన ఇది చేరకపోయినా... రశ్మిక అభిమానులు మాత్రం ఆమె పోషించిన బేతాళురాలి పాత్ర కొత్తగా ఉందని ఆనందిస్తున్నారు. ఇదిలా ఉంటే... రశ్మిక నటించిన మరో చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబర్ 7న పాన్ ఇండియా స్థాయిలో జనం ముందుకు రాబోతోంది. దీన్ని అల్లు అరవింద్ సమర్పణలో నిర్మించారు. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఓ కీలక పాత్రను చేయమని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగను అడిగారట. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ ఇటీవల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అతిథి పాత్రను మించిన ఓ కీలకమైన పాత్ర ఒకటి ఉంది. అది సందీప్ రెడ్డి వంగ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది. ఆయనలో మంచి నటుడు కూడా ఉన్నాడని నా నమ్మకం. అదే ధైర్యంతో ఆయన్ని అప్రోచ్ అయ్యాను. అయితే సందీప్ ఈ ఆఫర్ ను సున్నితంగా తిరస్కరించాడట. అతిథి పాత్రలో సరదాగా ఒకటి రెండు సీన్స్ అంటే ఓకే కానీ... నాలుగైదు సీన్స్ చేయడం కష్టమే' అని చెప్పేశాడట. దాంతో రాహుల్ రవీంద్రన్ ఆ పాత్ర చేయమని ప్రముఖ నటుడు 'వెన్నెల' కిశోర్ ను కోరాడట. ఎందుకంటే... 'వెన్నెల' కిశోర్, రాహుల్ రవీంద్రన్ మధ్య మంచి స్నేహం ఉంది. మాములూ గా అయితే రాహుల్ రవీంద్రన్ మాటను 'వెన్నెల' కిశోర్ ఎప్పుడూ కాదని చెప్పడు. కానీ ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, కమెడియన్ ఇమేజ్ ఉన్న తాను అలాంటి సీరియస్ పాత్ర చేస్తే జనం యాక్సెప్ట్ చేయరని కిశోర్ స్పష్టం చేశాడట. దాంతో ఇక గత్యంతరం లేక తానే ఆ పాత్రను చేశానని రాహుల్ తెలిపాడు. ఇటీవల వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ లో రాహుల్ రవీంద్రన్ కనిపించాడు. నిజానికి తాను మల్టిపుల్ టాస్క్ చేయలేనని, అందుకే దర్శకత్వం, నటన ఒకేసారి చేయడం ఇష్టముండేది కాదని రాహుల్ రవీంద్రన్ తెలిపాడు. తాను గతంలో దర్శకత్వం వహించిన 'చి.లా.సౌ.', 'మన్మథుడు -2' చిత్రాలలో అందుకే నటించలేదని తెలిపాడు. కానీ ఈ సినిమాలో మాత్రం ఆ పాత్ర చేయకతప్పలేదని అన్నాడు. నిజానికి రాహుల్ ఫస్ట్ ఛాయిస్ అయిన సందీప్ రెడ్డి వంగా ఈ పాత్రను చేసి ఉంటే... సినిమాకు ఖచ్చితంగా ప్లస్ అయ్యి ఉండేది. ఎందుకంటే... 'పుష్ప' సినిమా తర్వాత హిందీలో రష్మికా మందణ్ణకు మళ్ళీ ఆ రేంజ్ హిట్ ఇచ్చిన సినిమా 'యానిమల్'. దాని దర్శకుడు సందీప్ రెడ్డి వంగ, రశ్మిక స్క్రీన్ షేర్ చేసుకుని ఉంటే... ఖచ్చితంగా అది ఉత్తరాది ఆడియెన్స్ లోనూ క్యూరియాసిటీ క్రియేట్ చేసి ఉండేది.

# డ్యాన్స్‌తో అదరగొట్టిన ప్రభాస్ 'ఫౌజీ' హీరోయిన్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. వాటిలో 'సీతా రామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో రాబోతున్న 'ఫౌజీ' సినిమా ఒకటి. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి అనే కొత్త నటి హీరోయిన్‌గా ఎంపికైంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఒక డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియోలో ఇమాన్వి.. క్లాసికల్, మోడ్రన్ స్టెప్పులను కలిపి చేసిన డ్యాన్స్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. కేవలం కొన్ని గంటల్లోనే లక్షల వ్యూస్ సాధించిన ఈ వీడియోపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కామెంట్స్ సెక్షన్‌లో 'ప్రభాస్ జోడీకి పర్ఫెక్ట్ ఛాయిస్' అని, 'నెక్స్ట్ సీతారామం గర్ల్' అని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.'సీతా రామం' వంటి క్లాసిక్ చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న హను రాఘవపూడి, ఆ సినిమా ద్వారా మృణాల్ ఠాకూర్‌ను తెలుగు తెరకు పరిచయం చేశారు. ఇప్పుడు 'ఫౌజీ' కోసం ఇమాన్విని ఎంపిక చేశారు. అయితే, ఈ ఆఫర్ రావడానికి ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన డ్యాన్స్ వీడియోలే కీలక పాత్ర పోషించాయని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. శాస్త్రీయ నృత్యంలో ప్రావీణ్యం ఉన్న ఇమాన్వి, గతంలో పలు స్టేజ్ షోలు కూడా చేసింది.సినిమా సెట్స్ మీదకు వెళ్లకముందే ఇమాన్వి తన డ్యాన్స్ ట్యాలెంట్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రభాస్ వంటి స్టార్ హీరో సరసన ఈ కొత్త టాలెంట్ ఎలా ఆకట్టుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి ప్రభాస్-ఇమాన్వి జోడీ వెండితెరపై సృష్టించబోయే మ్యాజిక్‌పైనే నెలకొంది.



# అను ఇమ్మాన్యుయేల్ కు ఈసారైనా కలిసొస్తుందా?

ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో సందడి చేసిన మలయాళీ బ్యూటీ అను ఇమ్మాన్యుయేల్, సుమారు రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపై కనిపించనుంది. రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో అను ఒక కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించడంతో ఆమె రీఎంట్రీపై ఆసక్తి మొదలైంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగులో దాదాపు పది సినిమాల్లో నటించిన అను ఇమ్మాన్యుయేల్‌కు 'మజ్ను' మినహా చెప్పుకోదగ్గ విజయం లభించలేదు. పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, రవితేజ, నాని, నాగచైతన్య వంటి అగ్ర హీరోల సరసన నటించినప్పటికీ, ఆమెకు హిట్లు మాత్రం దక్కలేదు. దీంతో ఆమెపై 'ఐరన్ లెగ్' అనే ముద్ర పడింది. చివరిగా రవితేజ 'రావణాసుర' చిత్రంలో కనిపించిన ఆమె, ఆ తర్వాత తెలుగులో మరో సినిమా అంగీకరించలేదు. కేవలం తెలుగులోనే కాకుండా, తమిళంలోనూ 'జపాన్' సినిమా తర్వాత ఆమె ఏ ప్రాజెక్టులోనూ కనిపించలేదు.అయితే ఇప్పుడు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలో 'దుర్గ' అనే బోల్డ్ క్యారెక్టర్‌తో ఆమె సర్‌ప్రైజ్ ఇవ్వబోతోంది. రష్మిక, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలో అను పాత్ర కథను మలుపు తిప్పేదిగా ఉంటుందని తెలుస్తోంది. హీరోయిన్‌గా అవకాశాలు తగ్గిన తరుణంలో, కనీసం ఈ కీలక పాత్రతోనైనా తిరిగి ఫామ్‌లోకి వచ్చి టాలీవుడ్‌లో బిజీ అవుతుందేమో చూడాలి.

